ఉచిత కౌన్సెలింగ్ సెషన్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాలంటైన్స్‌డే సందర్భంగా బాగ్ లింగంపల్లి 'యూ అండ్ మీ సెంటర్'లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సెషన్ నిర్వహిస్తున్నట్లు కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.జీ. వీరేందర్ తెలిపారు. ప్రేమ వివాహాల తర్వాత కలిసి ఉండలేకపోవడం, ప్రేమ సంబంధిత విషయాల్లో ఒత్తిడి, డిప్రెషన్ తదితర సమస్యలపై కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అలాగే రాత్రి 8 గంటల నుంచి 9గంటల వరకు జూమ్ సెషన్ ఉంటుందన్నారు. పాల్గొనదలిచిన వారు 9390771469.

ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం



రేడియో దినోత్సవంలో పాల్గొన్న స్టేషన్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ రేడియో దినోత్సవాన్ని బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్టేషన్ డైరెక్టర్ ఉదయశంకర్ మంగళవారం మాట్లాడుతూ.. స్వాతంత్ర్య కాలం నుంచి ఆకాశవాణి సేవలను ప్రజలు వినియోగించుకున్నారన్నారు. నేటికి కూడా ఆకాశవాణికి ఆదరణ తగ్గలేదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేడియో ఆవిర్భావ విశేషాలు, రేడియోలోని వ్యవసాయ కార్యక్రమాలు, విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చించారు. జర్నలిజం విభాగం విద్యార్థులు, మేనేజ్‌మెంట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడు పురస్కారం ప్రదానం



చిక్కడపల్లి: కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళా భారతిల సంయుక్తాధ్వర్యంలో భారత కోకిల డాక్టర్ సరోజినీనాయుడు జయంతి వేడుకలను మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ప్రముఖులకు సరోజినీనాయుడు పురస్కారాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ గాయని శశికళాస్వామి పర్యవేక్షణలో నిర్వహించిన లలితసంగీత లహరి అలరించింది. ప్రముఖులు ఆచార్య గౌరీశంకర్, మధుసూదనరావు, ఇంద్రగంటి జానకి, పులిగడ్డ విజయలక్ష్మి, శైలజామిత్ర, సుగుణ, కృష్ణవేణి, భారతీకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆచారాలు ఉమ్మడి కుటుంబానికి మూలాధారం'



చిక్కడపల్లి: మన ఆచారవ్యవహారాలు ఉమ్మడి కుటుంబ సంక్షేమానికి మూలాధారాలని వైఎస్ఆర్‌మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వైఎస్ఆర్‌మూర్తి అన్నారు. హృదయ స్పందన కార్యక్రమాన్ని చిక్కడపల్లిలోని హ్యాపీ ఫ్రెండ్ సర్కిల్ ఆఫ్ ఇండియా సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నర్తకి కిరణ్మయి మాట్లాడుతూ.. మన సంస్కృతి, కళలు, జీవన లక్ష్యాలు జీవనప్రగతిపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ సందర్భంగా సాహితీ భీష్మ డాక్టర్ పోతుకూచి సాంబశివరావు సాహితీ పురస్కారాలను సాహితీవేత్తలకు అందజేశారు. దేవి, ప్రకాశరావు, సౌజన్య, శహన, రామగౌడ్ పాల్గొన్నారు. పలువురు హృదయస్పందన అనే అంశంపై కవితలు వినిపించారు.

వాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ముషీరాబాద్: నాగమయ్య బస్తీ పక్కన జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని దీన్ని తొలగించి జీహెచ్ఎంసీ వాహనాల రాకపోకలను నిషేధించాలని నాగమయ్య కుంట బస్తీ అధ్యక్షుడు సాయిలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంగళవారం జెడ్‌బీ గార్డెన్ చౌరస్తా ధర్నాలో సాయిలు మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ అధికారులు గత కొంత కాలం క్రితం జెడ్‌బీ గార్డెన్ చౌరస్తాలో చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారన్నారు. మంగళవారం ఉదయం నాగమయ్యకుంట బస్తీకి చెందిన స్వరూప(60) పెన్షన్ కోసం వెళ్తుండగా చెత్తను తరలించే జీహెచ్ఎంసీ వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిందని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లనే ఆమె గాయాలపాలైందని ఆరోపించారు. ఆమె తలకు తీవ్ర గాయాలై చేయి విరిగిందని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించామని తెలిపారు. గతంలో ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయని ఆరోపించారు. నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న డంపింగ్ యార్డును తరలించాలని ముషీరాబాద్ డీఎంసీ, ఏఎంహెచ్ఓ, చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. డంపింగ్ యార్డును తొలగించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సతీష్, యాదయ్య, యాదగిరి, సత్యనారాయణ, చంద్రమోహన్ తదితరులున్నారు.



నల్గొండ సభకు బీఆర్ఎస్ నేతలు

జోన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ తలపెట్టిన చలో నల్గొండ సభకు బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఇరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం బస్సుకు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

– అంబర్‌పేట/ ముషీరాబాద్ జోన్ల బృందం



ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తామని చెబుతున్న పాలకులు పేద బస్తీల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడి తాండాలో ఎంపీ నిధులతో వేసిన బోర్‌వెల్, వాటర్ ట్యాంకులను రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో నిధుల కొరత ఉందని, అధికారులు చెప్పడం సరికాదన్నారు.

గత ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం..

గత ప్రభుత్వం కూడా అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలకే పరిమితం చేశారని ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

- నగరంలో అనేక పేద బస్తీలలో డ్రైనేజీ, వీధిదీపాలు, తాగునీటి సమస్యలున్నాయని, అధికారులు నిధులు లేవని చెప్పడం బాధాకరమన్నారు. 30 శాతం జనాభా ఉన్న నగరంలో సౌకర్యాలు లేకపోవడం విచారకరమన్నారు.
- రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పేదలను ఆదుకుంటున్నామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే గాంధీనగర్‌లోని వివేకానందనగర్ బస్తీలో నివాసం ఉంటున్న దళితుల ఇళ్లను కూల్చివేయడాన్ని ప్రశ్నించారు.
- గత 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేసి వారిని విగత జీవులుగా చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి తిరిగి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, బండారు విజయలక్ష్మి, సీనియర్ నాయకులు పూసరాజు, రమేష్‌రామ్, పార్థసారథి, జైపాల్‌రెడ్డి, శివాజీ, డీఎంఎస్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, లంబాడి బస్తీ నాయకులు బన్సీలాల్‌నాయక్, కల్యాణ్‌నాయక్, సేవ్యా నాయక్, దేవేందర్, దావునానాయక్, ఓబానాయక్ తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు



ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్

మౌలిక వసతుల కల్పనకు కృషి..

ముషీరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మంగళవారం విద్యానగర్‌లోని ఎస్‌పీఈఎస్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ఎంపీ నిధులతో పవర్‌బోర్‌ను ఏర్పాటు చేశారు. అభినందన అప్నాఘర్ సంస్థ సహకారంతో మధ్యాహ్న భోజన షెడ్‌ను డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, రైల్వేస్టేషన్లు, ప్రాథమిక వైద్య కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, నాయకులు విశ్వనాథశాస్త్రి, కౌడిన్య ప్రసాద్, ఆర్.శేషసాయి, గౌరీశంకర్, కిషోర్, శ్యామ్, నందు, బద్రినారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, అప్నాఘర్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ ఈ.భవానీ, మురళీధర్ రావు, లక్ష్మీనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్ర పథకాలను వివరిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ జ్యోతినగర్‌లో 42వ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి మాజీ కార్పొరేటర్ రవీందర్ ఆధ్వర్యంలో కేంద్ర సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దోమలగూడ హనుమాన్ దేవాలయ కమిటీ మాజీ సభ్యుడు లక్ష్మణ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించేందుకు సంపర్క్ కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చేలా పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పేర్కొన్నారు. కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సీ మహేందర్‌బాబు, ప్రభాకర్, నాయకులు కుమార్‌గౌడ్ జ్యోతినగర్ బస్తీ అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి రవిచారి, కన్నయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్‌బోర్‌ను ప్రారంభం..

కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో ఎంపీ నిధులతో నిర్మించిన పవర్‌బోర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బండారు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ రవీందర్, వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌బాబు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ

ముషీరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో వివిధ హోదాల్లో పనిచేస్తూ.. 102 మంది ఉద్యోగులు చనిపోయారని వీరిలో 80 శాతం మంది పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తూ.. చనిపోయిన బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన వారేనని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. చనిపోయిన కుటుంబాల స్థానంలో కారుణ్య నియామకం కింద ప్రతిఏటా ఐదు శాతం మందిని నియమించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ గత పదేళ్లుగా బీజేపీ పాలనలో ఒకరిని కూడా నియమించకుండా కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆయన విమర్శించారు. కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల సంఘం ఆందోళనలు చేసిన సందర్భంగా తక్షణమే నియామకాలు చేపడతామని హామీ ఇచ్చిన రక్షణ శాఖ అధికారులు తమ మాటలను నిలబెట్టుకోలేదన్నారు. కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని 2022లో సిపిఎం విజ్ఞాపన పత్రం ఇచ్చిందని, నేటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు కంటోన్మెంట్ బోర్డు అధికారుల చుట్టూ.. తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందంటే తమ నియామకాలు ఆగిపోతాయని మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలుగు సాహిత్యంలో మేరు శిఖరం రవ్వా శ్రీహరి

కవాడిగూడ: వెనుకబడిన కులాలు పైకి రావాలంటే చదువులో ముందుండాలని రవ్వ శ్రీహరి నేర్పిన పాఠం విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోరని పలువురు వక్తలు తెలిపారు. సంస్కృత వ్యాకరణానికి భాష్యం చెప్పి, ప్రజల మాండలికాలను తయారు చేసిన తెలుగు సాహిత్య మార్గదర్శకుడు రవ్వా శ్రీహరి అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో రవ్వ శ్రీహరి రచనలు విహంగ వీక్షణం అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మనస చెన్నప్ప మాట్లాడుతూ.. రవ్వా శ్రీహరి సాంస్కృత వ్యాకరణానికి భాష్యం చెప్పారన్నారు. ప్రొఫెసర్ వెంకటేశ్వర్, ప్రొ.రాములు, తెలుగు అకాడమీ మాజీ సంచాలకులు ప్రొ. యాదగిరి, డాక్టర్ ఎస్ రఘు, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, సెక్రటరీ వాసు, పరిశోధక విద్యార్థి యాదగిరి తదితరులున్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి రిమాండ్

చిక్కడపల్లి: ఒక ట్రాన్స్‌జెండర్ నుంచి సెల్‌ఫోన్‌తో పాటు బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగు అర్ధరాత్రి స్నాచింగ్ చేసిన ఇద్దరు దుండగులను దోమలగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని పార్శీగుట్టకు చెందిన విద్యార్థి షేక్ సాజిద్ అహ్మద్(22) చదువుకుంటున్నాడు. కాగా ఇతను 11వ తేదీ రాత్రి లక్డీకాపూల్ వద్ద ఓ సెల్‌ఫోన్ తన బ్యాగ్ చేతిలో పట్టుకుని ఇంటికి వెళ్లేందుకు ఆటోబుక్ చేసుకున్నాడు. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని కింగ్‌కోటి ప్రాంతానికి చెందిన డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుకున్న విద్యార్థి మహ్మద్ అలీ (19)లు ఇద్దరూ కలిసి సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో స్కూటీ (టీఎస్9ఏఫ్ క్యూ5404)వాహనంపై లక్డీకాపూల్ చేరుకున్నాడు. అప్పుడే ఆటోఎక్కి వెళ్తున్న షేక్ సాజిద్ అహ్మద్ బ్యాగులు కొట్టేయాలని ప్రయత్నించినప్పటికి కుదరలేదు. దీంతో ఆటో వెంబడించి వెళ్లారు. లోయర్ ట్యాంక్‌బండ్ సిగ్నల్ వద్ద ఆటోను ఆటకాయించి బాధితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్ బ్యాగ్ లాక్కొని దోమలగూడ మీదుగా తమ ఇళ్లకు పరారయ్యారు. ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాగ్‌లో ఉన్న నాలుగు బంగారు ఉంగరాలు ఒక బ్రాస్లెట్ ఐఫోన్ చేత చిక్కించుకుని సోమవారం సాయంత్రం వాటిని అమ్మేందుకు యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తూ.. వీరిని పట్టుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



చిక్కడపల్లి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ తాళ్లబస్తీకి చెందిన కె.సమయ్య వృత్తిరీత్యా డ్రైవర్. కాగా ఆయన భార్య ఇద్దరు కూతుళ్లతో కలసి నివసిస్తున్నాడు. చిన్న కూమార్తె మౌనిక (17) రోజు మాదిరిగానే ఈనెల 10న ఉదయం 9 గంటలకు తండ్రి కాలేజీ వద్ద దింపి పని నిమిత్తం వెళ్లిపోయాడు. సాయంత్రం కుమార్తె తిరిగి ఇంటికి రాకపోవడంతో కాలేజీ ప్రిన్సిపాల్, టీచర్లకు ఫోన్ చేసి అడగగా.. ఆమె మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లిపోయిందని సమాధానం ఇచ్చారు. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా.. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ


హరివిల్లు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకనూరి ఇనాక్ తదితరులు

కవాడిగూడ: ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ నేషనల్ బుక్‌ఫెయిర్‌లో డాక్టర్ ఆలూరి విల్సన్ రచించిన హరివిల్లు (ఇంద్రధనస్సు) కవితా సంపుటి ఆవిష్కరణ సభను భూపతివెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇంద్రధనుస్సు రంగురంగుల కవితలు ఇందులో ఉన్నాయని, విల్సన్ కవిగా తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితుడని పేర్కొన్నారు. రచయిత కవిత్వాన్ని ఎంతో ప్రేమిస్తాడని, భవిష్యత్తులో మరింత మంచి సాహిత్యాన్ని అందించడానికి కృషిచేస్తాడని అభినందించారు. సహృదయం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వేదుల శ్రీరామశర్మ, మా ఈసీ మెంబర్ సినీనటుడు మానిక్‌తేజ, చుక్కారామదాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ మహ్మద్ హసీనా రచించిన సాహిత్య విమర్శన వ్యాసాలు తదేక పుస్తకావిష్కరణను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం అన్వీక్షికి పబ్లిషర్స్ ఆధ్వర్యంలో యువ రచయితల సదస్సు నిర్వహించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 36వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదికపై డాక్టర్ సీపీ రామస్వామి రచించిన 'తిరుక్కురాల్ ఆన్ ది ఆర్ట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పీ.ఏ చౌదరి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. నేటి యువత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, రచయిత ఆరోగ్యంపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అద్భుతంగా పొందుపరిచారని కొనియాడారు. రచయిత వినూత్నమైన రీతిలో పరిశోధన చేసి రాశారని, ఈ పుస్తకం రచయిత ఔనత్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం



కాచిగూడ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో మరోసారి బీజేపీ గెల్చుకుంటుందని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. బర్కత్‌పుర చమన్ వద్ద ఈనెల 14న బుధవారం సాయంత్రం 5 గంటలకు బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 17న పోలింగ్ బూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం ఇంపీరియల్ గార్డెన్స్‌లో జరుగుతుందని, ఈ సమావేశానికి మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, జాతీయ నాయకులు డాక్టర్ కె.లక్ష్మణ్, మురళీధర్‌రావు వంటి ముఖ్యనేతలు పాల్గొంటారన్నారు. మాజీమంత్రి కృష్ణయాదవ్, వీరెల్లి చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్ సాయి, మేకల సారంగపాణి, రవి, అమృత, కన్నె ఉమారమేష్‌యాదవ్, పూజ రాజు, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు విటమిన్- ఏ సిరప్ తప్పనిసరి

ముషీరాబాద్: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి తప్పనిసరిగా విటమిన్-ఏ సిరప్‌ను వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీప్తిప్రియాంక సూచించారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో చిన్నారులకు విటమిన్-ఏ సిరప్‌ను వేసే కార్యక్రమాన్ని అంబర్‌పేట క్లస్టర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలో 3709 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికి ఈనెల 17 వరకు యూపీహెచ్‌సీలలో విటమిన్-ఏ సిరఫ్‌ను వేయనున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'గృహజ్యోతి' పథకం



నల్లకుంట: అర్హులైన ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం అమలౌతుందని ఎలక్ట్రిసిటీ బర్కత్‌పుర సెక్షన్ ఏఈ బాలరాజు తెలిపారు. ఈ పథకం కోసం దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బర్కత్‌పుర ఎలక్ట్రిసిటీ అధికారులు మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్, సత్యానగర్ బస్తీలలో పథకానికి అర్హులైన వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించే క్యాంపును ఏర్పాటు చేశారు. ఏఈ మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వ ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల నుంచి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల దరఖాస్తు రశీదు, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ వినియోగం బిల్లు జిరాక్స్ ప్రతులతో పాటు మొబైల్ నంబరు ఇవ్వాలని చెప్పారు. ఎప్పటికప్పుడు ఈ వివరాలన్నింటినీ కంప్యూటర్‌లో నమోదు చేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన కుటుంబాలకు గృహ జ్యోతి పథకం అమలవుతుందని స్పష్టం చేశారు. బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ బస్తీవాసులకు గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రిసిటీ బర్కత్‌పుర సెక్షన్ ఎస్‌పీఎల్‌లు బాలకృష్ణ, పుష్ప హరిత, ఎఫ్ఎం బీవీశర్మ, సబ్ ఇంజినీర్ రిషిత, లైన్‌మెన్ గణేష్, సైదులు, బస్తీ పెద్దలు ఈశ్వర్, జగదీశ్వర్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383